ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 25 జనవరి 2025


ఆకట్టుకుంటున్న జలపాతాలు.. ఆలయాలు...
● జిల్లాలో పలు ప్రాంతాలు
● నేడు జాతీయ పర్యాటక దినోత్సవం
8

తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తాం
● కేంద్ర పట్టణాభివృద్ధి, విద్యుత్, గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్

7

ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంతంగా జరగాలి

సీపీ సమీక్ష సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ యూనిట్ల నిర్మాణంపై ఈ నెల 28న జెడ్‌పై హైస్కూల్ మైదానంలో జరిగే ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ భద్రత ఏర్పాట్లపై శుక్రవారం కమిషనరేట్‌లో రెవెన్యూ, ఎన్‌టీపీసీ సీఐఎస్ఎఫ్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటను జరుగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, అంతర్గాం, రామగుండం మండలాల్లోని ఎన్ని గ్రామాల నుంచి ఎంత మంది ప్రజలు హాజరుపై చర్చించారు. సమా వేశ ఏర్పాట్లు, పాస్‌ల జారీ, బందోబస్తు, ట్రాఫిక్ డైవర్షన్, పార్కింగ్, భోజనాల ఏర్పాట్లపై చర్చించారు. అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) రేణు, డీసీపీ చేతన, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీలు రమేష్, నర్సింహులు, ఎన్‌టీపీసీ సీజీఎం చందన్‌కుమార్ సమంత, హెచ్ఆర్ హెచ్‌ఓ శిఖదర్, ఏజీఎం బినోయ్ జోషి, డీజీఎం(హెచ్‌ఆర్)ప్రవీణ్, కేవీ రావు, ఆర్‌డీవో గంగయ్య, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ శాస్త్రి, తహసీల్దార్లు వాసంతి, జ్యోతి, రవీందర్, కుమారస్వామి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ బిక్షపతి, ఏ ఈఈవీరేశ్, సీఐలు,ఎస్‌ఐలు పాల్గొన్నారు.



మున్సిపల్ పాలక వర్గాల గడువు పూర్తి

● రేపటితో కౌన్సిల్ ముగింపు
● మంథని, సుల్తానాబాద్‌లో చైర్మన్ల మార్పు..
● రెండేళ్ల పదవీకాలాన్ని మింగిన 'కరోనా...'
● నాలుగున్నరేళ్లు నిధుల కటకటే
● ప్రస్తుతం ఊపందుకున్న అభివృద్ధి పనులు...
● అపవాదులను మూటగట్టుకున్న రామగుండం కార్పొరేషన్
● 27 నుంచి ప్రత్యేక అధికారుల పాలన...

కోల్‌సిటీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గాలకు ఈ నెల 26వ తేదీతో పదవీ కాలం పూర్తవుతుంది. 27 నుంచి ప్రత్యేకాధికారుల పాలన రానున్నది. ఈ సారి పాలకవర్గాలకు పదవీకాలంలో కరోనానే రెండేళ్ల కాలాన్ని మింగింది. అభివృద్ధి పనులు ముందుకు సాగలేదు. మున్సిపాలిటీలు నిధుల కొరతను ఎదుర్కొన్నాయి. ప్రభుత్వాల నుంచి ఆశించిన స్థాయిలో నిధులు రాకపోవడంతో అభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడింది. కరోనా, నిధుల కొరత, ఎన్నికలు, పాలక వర్గాల పాలనపై ప్రభావం చూపింది. జిల్లాలో రామగుండం నగరపాలక సంస్థతో పాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు ఉన్నాయి. 2020 జనవరి 27న పాలకవర్గాలు కొలువుతీరాయి. రామగుండంతోపాటు మంథని, పెద్దపల్లి, సుల్తానాబాద్‌ల్లో బీఆర్ఎస్ పాలకవర్గాలు అధికారాలు చేపట్టాయి. రాష్ట్రంలో అధికార మార్పిడి జరుగడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సుల్తానాబాద్, మంథనిల్లో అవిశ్వాసం పెట్టి చైర్మన్లను మార్చారు. రామగుండంలో మేయర్ బంగి అనీల్‌కుమార్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో అవిశ్వాసం లేకుండానే అధికార మార్పిడి జరిగింది. పెద్దపల్లి మున్సిపాలిటీలో పాలక వర్గ గడువు తక్కువగా ఉండడంతో అవిశ్వాసంపై దృష్టి పెట్టలేదు.

2020లో కొలువుతీరిన పాలకవర్గాలు...

2020జనవరిలో మున్సిపల్ ఎన్నికలు జరుగగా పాలకవర్గాలు 2020 జనవరి 27న కొలువుదీరాయి. రామగుండం నగరపాలక సంస్థలో 50డివిజన్లకుగాను కాంగ్రెస్ 11, బీఆర్ఎస్ 18, బీజేపీ 6, ఫార్వర్డ్ బ్లాక్ 9 గెలుపొందగా ఏడుగురు ఇండిపెండెంట్లు గెలిచారు. పార్టీ ఫిరాయింపులు, ఇండిపెండెంట్ల మద్దతుతో బీఆర్ఎస్ కార్పొరేటర్ బంగి అనీల్‌కుమార్ మేయర్‌గా ఎన్నికయ్యారు. మంథనిలో 13వార్డులు ఉండగా 11 బీఆర్ఎస్, రెండు కాంగ్రెస్ గెలిచాయి. పుట్ట శైలజ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. సుల్తానాబాద్‌లో 15 వార్డులకుగాను 9బీఆర్ఎస్ గెలుపొందగా సునీత చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. పెద్దపల్లిలో 36వార్డులకు గాను బీఆర్ఎస్ 24, కాంగ్రెస్ 5, బీజేపీ 2, ఎంఐఎం 2, ఇండిపెండెంట్లు ముగ్గురు గెలిచారు. దాసరి మమత చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మంథని, సుల్తానాబాద్‌ల్లో అవిశ్వాసాలు పెట్టారు. మంథనిలో పెండ్రి రమాసురేష్‌రెడ్డి, సుల్తానాబాద్‌లో గాజుల లక్ష్మీరాజమల్లు చైర్‌పర్సన్లుగా ఎన్నికయ్యారు.

రెండేళ్ల పదవీకాలాన్ని మింగిన కరోనా..

కరోనా విపత్తు ప్రస్తుత పాలకవర్గాల రెండేళ్ల పాలనకు విఘాతం కలిగించింది. లాక్‌డౌన్‌లతో జన జీవనం పూర్తిగా స్తంభించింది. సుమారు రెండేళ్ల పాటు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. మున్సి పాలిటీల్లో నిధుల కొరత ఏర్పడింది. అభివృద్ధి పనులతోపాటు ఇండ్ల నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు పడిపోయాయి. దీంతో కరోనా కాలంలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన కౌన్సిలర్లు, కార్పొరేటర్లు తమ తమ వార్డుల్లో శానిటైజేషన్ చేయించడం, నిత్యావసరాలు, మాస్కులు పంపిణీ చేయడం వరకే విధులు నిర్వహించారు. ప్రజల కనీస వసతులైన రోడ్లు, డ్రైన్లు, వీధిదీపాలు, మంచినీటి పైప్‌లైన్ల పనులకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి.

ప్రభుత్వ నిర్ణయాలతో స్థానిక సంస్థలకు ఖజానాలు ఖాళీ

గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న కొన్ని విధానపరమైన నిర్ణయాలు స్థానిక సంస్థల ఖజానాలను ఖాళీ చేశాయి. సాధా ణంగా స్టాంప్ డ్యూటీ, ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్ ప్రొఫెషనల్ ట్యాక్స్ తదితర నిధులు నేరుగా మున్సిపాలిటీలకు చేరేవి. ప్రభుత్వం ఈ నిధులను కూడా మళ్లించుకున్నది. పట్టణ ప్రగతి పేర నిధులు మంజూరు చేసింది. రెండేళ్లు నిధులు సజావుగానే విడుదలైనా తరువాత బ్రేక్ పడింది. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు జరిగిన పెద్దపల్లి, రామగుండం వంటి మున్సిపాలిటీలకు తీవ్ర నష్టం జరిగింది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో భూ బదలాయింపులకు సంబంధించిన రూ.30కోట్ల స్టాంప్ డ్యూటీ సొమ్మే మున్సిపాలిటీకి రాకుండా రాష్ట్ర ఖజానాకు చేరింది. మళ్లీ ఆ నిధులను విడుదల చేయలేదు. గ్రాంట్లను కూడా ప్రభుత్వం వాడుకుని విడుదల చేయడంలో తీవ్ర జాప్యాలు ఏర్పడ్డాయి. సీఎంఏ వంటి నిధులు విడుదల కాకపోవడంతో పనులు చేయమని కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. డీఎంఎఫ్‌టీ వంటి నిధులు మున్సిపాలిటీలకు మంజూరు కాగా వాటిని ప్రభుత్వం ఖజానాకు మళ్లించుకోవడంతో జిల్లాలోని మున్సిపాలిటీల్లో పనులు నిలిచిపోయాయి.

టీయూఎఫ్ఐడీసీతో ఊపందుకున్న అభివృద్ధి పనులు...

రాష్ట్రంలో అధికార మార్పిడి జరుగడంతో జిల్లాలోని మున్సిపాలిటీలకు గతేడాది టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరయ్యాయి. రామగుండం నగరపాలక సంస్థతో పాటు మంథని, పెద్దపల్లిలో ఈ నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మిగతా 8వ పేజీలో

పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి


ధూళికట్ట పాఠశాలలో ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

ఎలిగేడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని పాఠశాల విద్యారీజనల్ జాయింట్ డైరెక్టర్ కే.సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ధూళికట్ట ఉన్నత ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులను సన్నద్ధం చేస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాలు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులందరికీ చదవడం, రాయడం వచ్చేలా చూడాలన్నారు. వందశాతం అపార్ ఐడీలను నమోదు చేయాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఎంఈవో నరేంద్రచారి, ప్రధానోపాధ్యాయులు బిజిలి సదయ్య, మిట్టపల్లి యుగేందర్, ఉపాధ్యాయులు శ్రీశైలం, చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి, బాబు, శ్రీధర్, సంపత్‌రెడ్డి, శ్రీకాంత్, రవీందర్‌రావు, శ్రీనివాస్, జ్యోతి, శ్రీదేవి, సాధన, ప్రేమలీల పాల్గొన్నారు.

ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలి


రాఘవపూర్‌లో దీక్షకు మద్దతు తెలుపుతున్న సంఘాల నాయకులు

పెద్దపల్లి రూరల్ , జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయాలని, సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు, భిక్షపతి, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ నాయకులు ఆరెపల్లి శ్రీనివాస్, మాతంగి రాజయ్య, రామస్వామి, సదానందం, శంకర్ డిమాండ్ చేశారు. రాఘవపూర్ డివిజన్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరాన్ని శుక్రవారం నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. విద్యుత్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న వారిని ఆర్టిజన్స్ అనే పేరు పెట్టి వెట్టి చాకిరి చేయిస్తున్నారన్నారు. ఒకే పనికి రెండు సర్వీస్ రూల్స్ ఎలా అమలు చేస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్టిజన్ కార్మికులు టీవీఏసీ జేఏసీ జిల్లా చైర్మన్ కిషన్‌రెడ్డి, కన్వీనర్ మట్టరాజు, కోచైర్మన్ దుర్గం విశ్వనాథ్, ఫైనాన్స్ సెక్రటరీ దేవేందర్, శ్రీనివాస్ రెడ్డి, కాంపెల్లి రఘు, జడల సత్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజ్యాంగ స్థూప ఆవిష్కరణకు అనుమతి ఇవ్వాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ స్థూప ఆవిష్కరణకు కాటారంలో అనుమతి ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. ఆయన నివాసంలో ఈనెల 26న కాటారంలో ఆవిష్కరించే కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా జక్కు రాకేష్, బహుజన సేన ఆధ్వర్యంలో రాజ్యాంగ స్థూప ఆవిష్కరణకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటి వరకు డీఎస్పీ అనుమతి ఇవ్వలేదన్నారు. స్థూప ఆవిష్కరణ అనుమతి ఇవ్వకుంటే కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించక తప్పదన్నారు. ఈ విషయంపై మంత్రి స్పందించాల్సి అవసరం ఉందన్నారు. తగరం శంకరల్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, జంజర్ల శేఖర్, కిషన్‌రెడ్డి, శంకేశి రవీందర్, ఆసీఫ్‌లు పాల్గొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాటాలు చేసిన బీహార్ మాజీ సీఎం కర్పూరి ఠాకూర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జనరల్ ఆసుపత్రిలో యువతికి కణితి తొలగింపు

కళ్యాణ్‌నగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఓ యువతికి వైద్యులు శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలానికి చెందిన రజిత కడుపునొప్పితో గురువారం రాత్రి గోదావరిఖని ఆసుపత్రిలో చేరింది. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఓవరీస్ వద్ద కణితి ఏర్పడి రక్తనాళాలకు రక్తం సరఫరా కాకపోవడాన్ని గుర్తించారు. గైనిక్ హెచ్‌వోడీ అరుణ ఆధ్వర్యంలో కణితిని ల్యాప్రోస్కోపి ద్వారా తొలగించి రక్తప్రసరణ సక్రమంగా జరిగే విధంగా సరి చేశారు. కణితి చుట్టూ మడత పడడంతో రజితకు రక్తప్రసరణ ఆగిపోయిందని హెచ్‌వోడీ తెలిపారు. ల్యాప్రోస్కోపి చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు ఆమె తెలిపారు. వైద్యులు శ్రీదేవి, మౌనిక, అనీల్, సిబ్బంది పాల్గొన్నారు. ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన సిబ్బందికి సిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, సూపరింటెండెంట్ దయాల్ సింగ్ అభినందించారు.

రోడ్లపై తిరుగుతున్న పశువులకు రేడియం స్టిక్కర్లు

పెద్దపల్లిటౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రోడ్లపై తిరుగుతున్న పశువులకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రేడియం స్టిక్కర్లు వేశారు. ట్రాఫిక్ సీఐ అనీల్‌కుమార్ మాట్లాడుతూ రాత్రి వేళల్లో రోడ్లపై ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రేడియం స్టిక్కర్ల ద్వారా వాహనదారులు పశువులను గుర్తించవచ్చన్నారు. శాంతి నగర్ నుంచి రంగంపల్లి వరకు ఇదే పరిస్థితి ఉందన్నారు. వాహనాదారులు వేగాన్ని తగ్గించి పశువులను గుర్తిస్తూ డ్రైవింగ్ చేయాలని సూచించారు.



సామాన్యుడి చేతిలో వజ్రాయుధం ఓటు

సామాన్యుడి చేతిలోని వజ్రాయుధం ఓటు. తమకు నచ్చిన వారిని పాలకులుగా ఎన్నుకునే అవకాశం ఓటు హక్కు ద్వారానే లభించింది. ఓటరుగా దేశ రాజకీయ వ్యవస్థనే మార్చే అవకాశం ఉన్నందుకు గర్వించాలి. ఓటు హక్కు నమోదు వినియోగంపై అవగాహన కల్పించే దిశగా యేటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు ఓటరు దినోత్సవాన్ని శనివారం జిల్లాలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

● జిల్లాలో మొత్తం ఓటర్లు 7,18,043
● పోలింగ్ కేంద్రాలు 845
● మహిళా ఓటర్లే అధికం
● ఓటు హక్కు నమోదుకు విస్తృత ప్రచారం
● నేడు జాతీయ ఓటరు దినోత్సవం

పెద్దపల్లి కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కలిగించడానికి ఎన్నికల కమిషన్ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థ పైన ప్రజలకు విద్యార్థులకు అవగాహన కలిగించడానికి ఎన్నికల కమిషన్ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుంది. కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేస్తోంది. 2011 జనవరి 25 నుంచి కమిషన్ ఫౌండేషన్ రోజును గుర్తించడానికి ప్రారంభమైంది మాజీ ప్రధానమంత్రి దివంగత మన్మోహన్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక చట్టాన్ని రూపొందించారు. సవరించిన జాబితా ప్రకారం ప్రస్తుతం జిల్లాలో 7,18,043 ఓటర్లు ఉన్నారు.

జిల్లా ఓటర్లు 7,18,043

సవరించిన ఓటర్లు జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈయేడు జనవరి 1 వరకు చేర్పులు, మార్పులతో కూడిన ఓటరు మిగతా 8వ పేజీలో

ఐ ఓట్ ఫర్ ష్యూర్

నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే థీమ్ తో 15వ జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలను కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నా మని కలెక్టర్ కోయ శ్రీహర్ష గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటర్ నమోదు పెంపు, ఎథికల్ ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు యేటా జనవరి 25న జాతీయ ఓటర్ దినోత్సవంగా నిర్వహిస్తామని, ఈయేడు నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే థీమ్‌తో వేడుకలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలోని ప్రతి బూత్ స్థాయి అధికారి పోలింగ్ స్టేషన్ పరిధిలో నూతన ఓటరకు ఓటర్ కార్డుల పంపిణీ, వృద్ధ ఓటర్ల సన్మానం చేపడుతారన్నారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి


డ్రైవర్‌కు పూలు ఇస్తున్న డీఎం

కళ్యాణ్‌నగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆర్‌టీసీ బస్సుల్లో ప్రయాణికులను డ్రైవర్లు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగభూషణం అన్నారు. డ్రైవర్ల దినోత్సవం, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం గోదావరిఖని బస్టాండ్ నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడు ఆర్టీసీ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్ల పాత్ర కీలకమన్నారు. డ్రైవర్లు ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తగా బస్సులను నడపాలని, విధి నిర్వహణలో మద్యం సేవించరాదన్నారు. ప్రమాద రహితంగా బస్సులను నడిపిన ఉత్తమ డ్రైవర్లను అభినందించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ వేగంగా, మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై ఎంతో మంది మృతి చెందుతున్నారని, దీంతో వేలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవర్లకు గులాబీ పూలను అందేశారు. ఎంవీఐ సంతోష్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్‌ఐలు హరిశంకర్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష


ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

సుల్తానాబాద్, జనవరి 24: (ఆంధ్రజ్యోతి): నాలుగైదు మండలాలకు కూడలిగా ఉన్న సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషంట్లకు అందుబాటులో వైద్యులు ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గైనిక్ రూమ్, లేబర్ రూమ్, జనరల్ వార్డ్, ఓపీ రూమ్స్, ల్యాబ్‌లను కలెక్టర్ పరిశీలించారు. రక్త, మూత్ర పరీక్షల కోసం ఎంత మంది వస్తున్నారు, వారికి సంబందించిన ఎన్ని శాంపిల్స్ నమూనాలను టీ-హబ్‌కు పంపుతున్నారు, వాటి ఫలితాలు ఎంత సేపటికి వస్తున్నాయో తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. సుల్తానాబాద్ ఆసుపత్రి పరిధిలోని కొలనూరు, ఎలిగేడు, గర్రెపల్లి, జూలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సమావేశాన్ని నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి లోపల, బయట శుభ్రత పాటించాలని అన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవితో మాట్లాడుతు అస్పత్రిలోని సమస్యల గురించి ఇతర సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.

● పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్ చేయాలి

ఈనెల 26 నుంచి అమలయ్యే పథకాల లబ్ధిదారుల వివరాల ఆన్‌లైన్ నమోదులో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ అక్కడ జరుగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియన పరిశీలించారు. గ్రామ సభల ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించి అర్హత ఉంటే పథకాల లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ దివ్యదర్శన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

మంథనిరూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన వారికే కేటాయించాలని మంథని ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. సూరయ్యపల్లి గ్రామానికి చెందిన ఆర్ల వెంకన్న, లింగయ్య, జంజర్ల రాజు, గట్టయ్య, మల్లేష్, వెంకన్న, చిన్న మల్లయ్య, శంకర్‌లు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలకు పాల్పడిన గ్రామ కార్యదర్శి, కారోబార్ పై చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలుడిపై లైంగిక దాడి?

వేములవాడ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలుడిపై 14ఏళ్ల బాలుడు లైంగికదాడికి పాల్పడినట్లు తెలిసింది. వేములవాడ మున్సిపల్‌పరిధిలోని ఓ కాలనీకిచెందిన బాలుడిపై గురువారం సాయంత్రం అదేకాలనీకి చెందిన 14ఏళ్ల బాలుడు అఘాయిత్యానికి పాల్పడడంతో బాలుడికి తీవ్ర రక్తస్రావమైంది. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో బాలుడిని ఆసుపత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ఇల్లంతకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన వెదిరె పరశురాంను అరెస్టు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి శుక్రవారం పేర్కొన్నారు. సీఐ తెలిపినవివరాల ప్రకారం.. కరీంనగర్ జైలులో జీవితఖైదు శిక్ష అనుభవిస్తున్న పరశురాంకు కరీంనగర్‌కు చెందిన బాధితురాలితో పరిచయం ఏర్పడింది. గతనెల 24న పెరోల్‌పై బయటకు వచ్చిన పరశురాం కరీంనగర్‌లో ఉన్న బాధితురాలి వద్దకు వెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈనెల 20న బాధితురాలిని తన ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి అనంతగిరి గ్రామానికి తీసుకవెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం పెద్దలింగాపూర్ గ్రామం వైపు ద్విచక్రవాహనంపై తీసుకొని వెళుతుండగా బాధితురాలు కేకలు వేయగా పరశురాం పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శుక్రవారంఅనంతగిరి గ్రామసమీపంలో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిపై గతంలో హత్య కేసుఉండగా జీవితఖైదు అనుభవిస్తున్నట్లు సీఐ తెలిపారు. సీఐ వెంట ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్‌తోపాటు పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

భీమారం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలకేంద్రానికి చెందిన చెరుకూరి లక్ష్మి(52) అనే మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. లక్ష్మి కొన్నిరోజుల నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన లక్ష్మి శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు లక్ష్మి కూతురు గుడ్ల స్వప్న ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు సంతానం కాగా అందరికీ వివాహాలు అయ్యాయి. కొడుకు ప్రస్తుతం గల్ఫ్ దేశంలో ఉంటున్నాడు.

విచ్చలవిడిగా గంజాయి



● వాట్సప్ గ్రూపుల ద్వారా అమ్మకాలు

జమ్మికుంట రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. గడిచిన ఏడాది కాలంలో గంజాయి విక్రయిస్తూ పోలీసులకు చిక్కిన వారిలో మహిళలు ఎక్కువగా ఉండడం విశేషం. మహిళల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని గంజాయి ముఠాలు వారిని ఈ ఊబిలోకి దింపుతున్నాయి. మహారాష్ట్ర నుంచి రైలు మార్గంలో వస్తువుల మధ్య గంజాయి ప్యాకెట్లు పెట్టి జమ్మికుంట రైల్వే స్టేషన్‌కు తీసుకు వస్తున్నారు. రైల్వే స్టేషన్‌ను ఆనుకోని ఉన్న కొత్తపల్లి నుంచి ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది.



● మత్తుతో చిత్తు అవుతున్న యువత..

గంజాయి మత్తుకు ఎక్కువగా యువకులు బానిసలవుతున్నారు. వారిలో ఎక్కువగా 18 నుంచి25ఏళ్ల మధ్య వయస్సు వారు ఉంటున్నారు. మొదట సిగరెట్లకు అలువాటు పడుతున్న యువత తర్వాత గంజాయి వైపు మరలుతున్నారు. నిర్మానుష్య ప్రాంతాలను అడ్డాగా చేసుకుని గంజాయి సేవిస్తున్నారు. మొదట సిగరేట్ ప్యాకెట్లు కొనుగోలు చేసి, అందులోని పొగాకు బయటకు తీసి గంజాయితో నింపి సేవిస్తున్నారు.గంజాయి కొనుగోలు చేసే వ్యక్తుల కోసం ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్‌లు ఏర్పాటు చేశారు. తమకు ఎంత మేరా గంజాయి కావాలో గ్రూపులో పోస్టు చేస్తే సదరు ఆడ్రస్‌కు క్షణాల్లో గంజాయిని చేర్పుతున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ఇందుకు ఖరీదైన బైక్‌లు వాడుతున్నారు.

● గంజాయి సేవించి వింత ప్రవర్తన..

తక్కువ ధరకు ఎక్కువ కిక్కు ఇస్తుండడంతో యువత గంజాయి వైపు ఆకర్షితులవుతున్నారు. గంజాయి సేవించిన తర్వాత వారి ప్రవర్తన వింతగా మారుతోంది. బైకులపై అతి వేగంగా ప్రమాదాలకు కారణమవుతున్నారు.

నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు కేసుల్లో నిందితుడు అశోక్‌కు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.100జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పట్టణం బీవై నగర్‌కు చెందిన ఎం భాస్కర్ అనే వ్యక్తి బైక్‌పై రాజీవ్‌నగర్ నుంచి బీవైనగర్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న సిరిసిల్ల పట్టణం సంజీవయ్యనగర్‌కు చెందిన యాలకుల అశోక్ అనే వ్యక్తి ఢీకొన్నాడని ఆయన తెలిపారు. దీంతో అశోక్, భాస్కర్‌తో గొడవ పడుతూ తాను పోలీసునని, తన మోటార్‌సైకిల్‌తో ఢీకొంటావా అంటూ రూ.3వేలు జరిమానా కట్టమని భాస్కర్‌ని బెదిరించాడన్నారు. డబ్బుల్లేవని బతిమిలాడినా వదలకుండా బలవంతంగా అశోక్ అనేవ్యక్తి భాస్కర్ ఏటీఎం కార్డు తీసుకొని డ్రాచేసుకున్నాడని ఆయన తెలిపారు. కొద్దిసేపటి తరువాత అతను పోలీస్ కాదని, డ్రైవర్ అని తెలుసుకొని భాస్కర్ అనేవ్యక్తి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు నమోదు చేసి విచారణ అనంతరం అప్పటి ఎస్ఐ బి శ్రీనివాస్ అరెస్ట్ చేసి రిమాండ్ చేశారన్నారు. మరోదొంగతనం కేసులో అశోక్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించారని ఆయన తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడికి ఏడు నెలలు..

ఇల్లంతకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఎల్లమ్మ గుడి ఆలయంలో జరిగిన దొంగతనం కేసులో సూర దేవేందర్ అనే నిందితుడికి సిరిసిల్ల రెండవ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి గడ్డం మేఘన జైలుశిక్ష విధించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. రెండు సంవత్సరాల క్రితం రేణుకాదేవి ఆలయంలో హుండీని పగలగొట్టి దేవేందర్ నగదు ఎత్తుకెళ్లాడు. కోర్టులో నేరం నిరూపణ కావడంతో న్యాయమూర్తి 17 నెలల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ఇల్లందకుంట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన చందగల్ల సాంబయ్య(60) చికిత్సపొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారుతెలిపిన వివరాల ప్రకారం.. మృతుడికి సరిగా మతిస్థిమితంలేదు. ఈ నెల20న ఇంట్లో ఎవరూలేని సమయంలో మద్యంతాగి, తలుపులు పెట్టుకొని ఇంటికి నిప్పటించాడు. దీంతో సాంబయ్యకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పిఅతనిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు.చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలు మృతి



మృతి చెందిన సావిత్రి

కరీంనగర్ అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కరీం నగర్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సావిత్రి(60) అనే వృద్ధు రాలు మృతిచెందిందని అవుట్‌పోస్టు హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు. రామ గుండం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గురువారం 108సిబ్బంది అంబులెన్స్‌లో సావిత్రిని తీసుకొచ్చి కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలో అడ్మిట్ చేశారు. సావిత్రికి సంబంధించిన వారు ఎవరూ లేరని, ఆమెను గుర్తించినవారు కరీంనగర్ ప్రభుత్వాస్ప త్రిలోని అవుట్‌పోస్టు పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



గౌతమి (ఫైల్)

తిమ్మాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూరు శివారు మానకొండూరు వెళ్లే రహదారిపై గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహ నాన్ని ఢీకొన్న సంఘటనలో మహిళ మృతిచెందగా మృతురాలి భర్తకు గాయాలయ్యాయి. ఎల్ఎండీ ఎస్ఐ వివేక్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూరు మండలం అన్నారం గ్రామానికి చెందిన రుద్రోజు శ్రీనివాసచారి తన భార్య గౌతమి(30) వారి ఇద్దరు చిన్నపిల్లలు పాప రసజ్ఞ(3), బాబు రుద్రాంష్ (8నెలలు)తో కలిసి పనినిమిత్తం కరీంనగర్‌కు వారి ద్విచక్రవాహనం (టీఎస్02ఎఫ్‌బి 6995)పై వెళ్లారు. పని ముగించుకుని తిరిగి అన్నారంకు బయలుదేరి వెళుతుండగా అలుగునూరు శివారులోని లక్ష్మీనరసింహా ఫంక్షన్‌హాల్ సమీపంలో గుర్తుతెలియని వాహనం వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ సంఘటనలో ద్విచక్రవాహనంపై వెనకాల కూర్చున్న గౌతమి కిందపడిపోగా ఆమె తలపై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త శ్రీనివాస్‌చారికి కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. పిల్లలు మాత్రం ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డారు. శ్రీనివాసచారిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్ఐ వివేక్ తెలిపారు.

సైదాపూర్ మండలంలో ఒకరు..

సైదాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని ఘణపూర్ గ్రామానికి చెందిన గుంటి శ్రీనివాస్(38) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ దుద్దెనపల్లిలోని తన బంధువులు మృతి చెందగా, అంత్యక్రియలకు తన ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో దుద్దెనపల్లి, సైదాపూర్ మధ్య గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అనారోగ్యంతో ఒకరు..

హుజూరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం గణేష్‌నగర్‌కు చెందిన సోయం రాజు(30) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందినట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. గణేష్‌నగర్‌కు చెందిన రాజు ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికితోడు అతడు మద్యానికి బానిసవగా శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

మండల సరిహద్దులో పులి సంచారం..

● రాత్రి వేళల్లో రైతులు పొలాల వద్దకు వెళ్లవద్దు

చందుర్తి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాలమండల సరిహద్దుల నుంచి చందుర్తి మండల సరిహద్దుల్లో పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించినందున మండల రైతులు, గొర్రెలకాపర్లు అప్రమత్తంగా ఉండాలని చందుర్తి ఎస్ఐ అంజయ్య, అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాఘవేందర్‌రావులు శుక్రవారం తెలిపారు. కొడిమ్యాల మండలంలోని కొండాపూర్ శివారులో పులి ఓ ఆవును చంపిందని, మండలంలోని తిమ్మాపూర్, రామన్నపేట, నర్సింగాపూర్ గ్రామాల శివారులో సంచరిస్తోందన్నారు. రాత్రి సమయంలో రైతులు పొలాల వద్దకు వెళ్లకూడదని, మధ్యాహ్న సమయంలో కూడా ఒంటరిగా వెళ్లకూడదన్నారు. రాత్రి సమయంలో పొలాల వద్ద ఎలాంటి విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయకూడదన్నారు. ఎలాంటి సమాచారం తెలిసినా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని ఆవునూర్ మూలమలుపు వద్ద శుక్రవారం ఇసుక ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెంకటాపూర్, ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామాలకు చెందిన నర్సయ్య, సురేశ్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వానుపత్రికి తరలించారు. నర్సయ్య, సురేశ్‌లు తమ ద్విచక్రవాహనంపై వెంకటాపూర్ నుంచి ఆవునూర్ వైపు వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ అతివేగంగా ఢీకొట్టింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన హీక్యానాయక్ తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. హీక్యానాయక్ తన ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో కామారెడ్డి నుంచి ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం హీక్యానాయక్‌ను ఢీకొట్టింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

అనారోగ్యంతో ఎంఈవో మృతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఈసరి రవీందర్(57) అనారోగ్యంతో వరంగల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. రవీందర్ కొంతకాలంగా మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్నారు. పరిస్థితి విషమంగా మారడంతో వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ చనిపోయారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన ఎల్లారెడ్డిపేటకు తీసుకురావడంతో స్థానికంగా విషాదం నెలకొంది. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

పోరాట యోధుడు సర్వాయి పాపన్న

- పాపన్న చరిత్ర దేశానికి చాటిచెప్పేలా పాపన్న గుట్టల అభివృద్ధి
- సర్వాయిపాపన్న నివసించిన ప్రాంతం సర్వాయిపేటను పర్యాటక కేంద్రంగా మారుస్తాం
- పాపన్న గుట్టల అభివృద్ధికి త్వరలోనే మరిన్ని నిధులు
- సైదాపూర్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



సర్వాయి పాపన్న కోట అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని రాష్ట్రరవాణా, బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఆయన సైదాపూర్ మండలం సోమారం గ్రామశివారులోని మోడల్‌స్కూల్‌ను సందర్శించారు. స్కూల్ అభివృద్ధికి రూ.60లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రహరీ కోసం రూ. 48లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.12లక్షలు మంజూరు చేస్తానన్నారు. వెన్నంపల్లిలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం సర్వాయిపేట శివారులోని కొమ్ము గుట్ట వద్ద ఉన్న సర్వాయిపాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వాయి పాపన్న గుట్టలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మంజూరు చేసిన రూ.4.70కోట్ల నిధులతో చేపట్టే పనుల ప్రారంభానికి శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో మంత్రి పొన్నంప్రభాకర్ మాట్లాడుతూ సర్దార్‌సర్వాయి పాపన్న చరిత్రను దేశానికి చాటి చెప్పేలా పాపన్న నివసించిన ప్రాంతాన్ని అభివృద్ధిచేసి, పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతామన్నారు. ప్రస్తుతానికి సర్వాయి పేటగ్రామంలో సర్వాయిపాపన్న కోట అభివృద్ధికి మంజూరు చేసిన రూ.4.70కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. త్వరలోనే ఈ ప్రాంతం అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తామన్నారు. సర్వాయిపేట కోట పనులు పూర్తయ్యాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రారంభోత్సవం చేయిస్తామన్నారు. మరిన్ని నిధులతో మరోదశ అభివృద్ధిని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలాసత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ట్రైనీకలెక్టర్ అజయ్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, సహకార సంఘాల అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, తెలంగాణగౌడ సంఘం అధ్యక్షుడు భువనగిరి యాదగిరిగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ వ్యవహారంలో బెదిరింపులకు పాల్పడిన ముగ్గురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విక్రయించిన భూమిని తిరిగి అప్పగించాలని బెదిరింపులకు పాల్పడిన సిరిసిల్ల పట్టణంలోని బి.వై.నగర్‌కు చెందిన దండుగుల రాజు(48)తో పాటు కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన మెరుగు లక్ష్మన్(48), కోనరావుపేటకు చెందిన ముదాం ప్రసాద్(46) అనే ఇద్దరు మాజీనక్సలైట్‌లను శుక్రవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని వెంకటేశ్వర టెంపుల్ వీధికి చెందిన మర్రిపల్లి శ్రీనివాస్, అతడి సోదరులు కలిసి 2016లో స్థానిక నెహ్రూ నగర్‌కు చెందిన నక్కరాజు వద్ద పెద్దూరు శివారులోని సర్వేనంబర్ 55జీలో 3.16ఎకరాల భూమిని కొనుగోలుచేసి వ్యవసాయం చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. 2015లో దండుగుల యాదమ్మ వద్ద నక్కరాజు అనే వ్యక్తి అట్టి భూమి కొనుగోలు చేయగా తర్వాత ధర పెరగడం వల్ల వారు అమ్మిన భూమిని ఎలాగైనా దక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో మర్రిపల్లి శ్రీనివాస్‌ను ఎంత బెదిరించినా భయపడకపోవడంతో దండుగుల రాజు మాజీ నక్సలైట్ మెరుగు లక్ష్మన్, ముదాం ప్రసాద్‌లతో కుమ్మక్కై వారిని బెదిరించి భూమి లాక్కొని సగం సగం తీసుకోవాలని ప్రయత్నించారని తెలిపారు. ఇదే క్రమంలో పలుమార్లు శ్రీనివాస్‌ను బెదిరించి దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని చూడగా అప్పటికే దండుగుల రాజు, అతని తల్లి యాదమ్మ, భార్య లక్ష్మిలపై ఐదు కేసులు నమోదు అయ్యాయని ఆయన తెలిపారు. అయినప్పటికీ మర్రిపల్లి శ్రీనివాస్ భూమిని లాక్కోవాలనే ఉద్దేశ్యంతో జనవరి19న చంపుతామని బెదిరించారని, అంతేకాకుండా నక్కరాజు వద్ద రూ.16 లక్షల అప్పు తీసుకొని దానికి బదులుగా 3.16 ఎకరాల భూమి కుదువ పెట్టినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించి దానిని చూపిస్తూ భూమి తమ వారిదేనని బెదిరించారని ఆయన తెలిపారు. శ్రీనివాస ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ముగ్గురు నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు ఇదే అసలైన సమయం

● ఎవరు అడ్డుపడినా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధిద్దాం ● ఇంటికో డప్పుతో కదలండి.. విజయవంతం చేయండి..

● ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్ష డప్పులు మోగిద్దాం.. ● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



ర్యాలీలో డప్పు కొడుతున్న మందకృష్ణ మాదిగ

సిరిసిల్ల క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణ అమలుకు ఇదే అసలైన సమయమని, ఎవరు అడ్డుపడినా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధిద్దామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని కె కన్వెన్షన్‌లో 'లక్ష డప్పులు... వేల గొంతుల కార్యక్రమానికి తరలి రండి' సభ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొనపురం లక్ష్మణ్ మాదిగ అధ్యక్షతన భారీసభ నిర్వహించారు. ముందుగా సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి మందకృష్ణ మాదిగ పూలమాలలు వేసి, అంబేద్కర్ చౌరస్తా నుంచి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వరకు డప్పు చప్పుళ్లతో భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు... వేలాది గొంతులు అనే కార్యక్రమానికి ప్రతి ఇంటి నుంచి డప్పులతో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. డప్పులు లేకుండా రావద్దన్నారు. ఈ మహత్తర సాంస్కృతిక కార్యక్రమంపై ప్రపంచమే మనవైపు ఎదురు చూస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ ఇపుడు అమలు చేయకపోతే ఎపుడూ చేయలేమన్నారు. ఎస్సీలలో 58కులాలు ఒక వైపు ఉంటే ఒకే ఒక్క మాలలు మరోవైపు ఉన్నారన్నారు. ప్రతి 100మందిలో 80మంది మాదిగలుంటే 20మంది మాలలు ఉన్నారన్నారు. ఈ విధంగా రిజర్వేషన్లలోనూ అన్యాయం జరుగుతోందన్నారు. చెప్పులు కుట్టి, డప్పులు కొట్టి మాదిగలు సమాజానికి సేవ చేశారని, సాంప్రదాయ వాయిద్యంగా డప్పు చూసి గర్వపడాలన్నారు. ప్రతి ఇంటిలో డప్పులు ఉండాలని, ప్రతి మాదిగ బిడ్డ వెంటనే డప్పుకొని ఇంట్లో పెట్టుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం సాధించిన విజయఫలాలను మాదిగ బిడ్డలకు చేరకుండా మాలల వర్గం కుట్రలు చేస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఆగస్టు 1న ఏడుగురు జడ్జీల ధర్మాసనంలో ఆరుగురు జడ్జీలు అనుకూలంగా ఉండి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందని తీర్పు ఇచ్చిందన్నారు. నాలుగు నెలలైనా తెలంగాణలో అమలు చేయడంలేదని, తీర్పువచ్చిన రోజు అసెంబ్లీలో సీఎం అనుకూలంగా మాట్లాడారన్నారు. ఎస్సీ వర్గీకరణకు మాలల వర్గమే అడ్డుపడుతోందన్నారు. కార్యక్రమంలో ఉద్యమనాయకులు దరువు అంజన్న, ఏపూరి సోమన్న, భరత్, అశోక్, సంజీవ్ తదితర కళాకారులు డప్పు చప్పుళ్లు, ఆట పాటలతో హోరెత్తించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాసు, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్, అంకని బాను, థామస్, ఎంఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటస్వామి మాదిగ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రుద్రారపు రాంచంద్రం మాదిగ, సత్యనారాయణ, బాలరాజు, లక్ష్మన్, దేవయ్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చంపుతామని బెదిరించిన ఇద్దరి అరెస్టు

వేములవాడ రూరల్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): చంపుతామని బెదిరించిన ఇద్దరిని అరెస్టుచేసి రిమాండుకు తరలించినట్లు రూరల్‌సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. బోయినిపల్లి గ్రామానికిచెందినశ్రీనివాస్ హోటల్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. కూతురి వివాహం నిశ్చయం కావడంతో డబ్బు అవసరమై తన ఇంటిని అమ్మదలచి ఓ విలేకరి సహాయం కోరాడు. అతడు వేములవాడకు చెందిన కడారి తిరుపతి అనే రౌడీషీటర్‌ను శ్రీనివాస్ దగ్గరకు తీసుకువచ్చి ఇల్లు కొనడానికి రూ.50వేలు అడ్వాన్స్‌గా ఇచ్చి ఒప్పందం చేసుకున్నారు. తర్వాత డబ్బులు పూర్తిగా చెల్లించకుండానే చంపుతానని బెదిరించి ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్లను తిరుపతి తీసుకెళ్లడంతో బాధితుడు శ్రీనివాస్ బోయినిపల్లి పోలీసులను ఆశ్రయించాడు. దీంతోపోలీసులు కడారి తిరుపతి, పత్రికా విలేకరిని పట్టుకుని వారి వద్ద నుంచి ఇంటిపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టుచేసి రిమాండుకు తరలించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గంగాధర, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధురానగర్‌లో పేకాట రాయుళ్లను పట్టుకున్నట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. మధురానగర్‌శివారులోని మామిడి తోటలో పేకాడుతున్నారని పక్కాసమాచారం మేరకు దాడిచేసినట్లు తెలిపారు. ఈదాడిలో 8మంది పేకాడుతుండగా పట్టుబడినట్టు ఆయన తెలిపారు. వారినుంచి రూ.20,500లు, 7సెల్‌ఫోన్లు, 4బైకులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

'పొలాస'లో రైతులకు శిక్షణ


జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాసలో శుక్రవారం యాసంగి వరిలో ప్రధాన సమస్యలు, యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లా డుతూ వరిలో మొగిపురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3సీజీ ఎకరానికి 10కిలోల చొప్పున 20-25 కిలోలు ఇసుకను కలుపుకొని బురద పదనలో చల్లాలన్నారు. ఈ సమావేశంలో పరిశోధన స్థానం ఏడీఆర్ శ్రీనివాస్, శాస్త్రవేత్తలు బలరాం, స్వాతి, సాయినాథ్, రజినీకాంత్, మదన్‌మోహన్‌రెడ్డి, రజినీదేవి, శ్రీలక్ష్మీ, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల రైతులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు శుక్రవారం కరీంనగర్‌లోని అంబేద్కర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని 10 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ అప్పారవు, డాక్టర్ రాజగోపాల్, అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, సిరిసిల్ల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్ పరీక్షలు

తిమ్మాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ తొలివిడత ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీచైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్, కరీంనగర్‌లోని వాణినికేతన్ డిగ్రీఅండ్‌పీజీ కళాశాలలో మొత్తం కలిపి నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నాలుగు పరీక్షా కేంద్రాల్లో కలిపి మొదటి సెషన్‌లో 967 మంది అభ్యర్థులకు 946మంది హాజరు కాగా 14మంది గైర్హాజరు అయ్యారు. రెండు సెషన్‌లలో కలిపి 1926మంది విద్యార్థులకు గాను 1891మంది హాజరు కాగా 35మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ టి లలిత కుమారి తెలిపారు.



సిరిసిల్ల మిడ్‌మానేరులో నిరుపయోగంగా బోటు

పర్యాటక శోభ ఏదీ?

- ధార్మిక, కార్మిక క్షేత్రానికి... పర్యాటక సొబగులు
- టెంపుల్ టూరిజం వైపు అడుగులు
- ప్రారంభోత్సవానికే పరిమితమైన మిడ్ మానేరు జల విహారం
- అనంతగిరి ప్రాజెక్టులో 40 ఎకరాల్లో ఐలాండ్

● 40 ఎకరాల్లో ఐలాండ్ అభివృద్ధికి మోక్షం కలిగేనా...?

ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద గుట్టలను అనుసంధానం చేస్తూ అన్నపూర్ణ, అనంతగిరి ప్రాజెక్టును నిర్మించారు. ఇక్కడే ఆసియాలోనే అతిపెద్ద సర్జ్ పూల్ బావిని కూడా నిర్మించారు. ప్రాజెక్టులో మధ్యలో ఉన్న 40 ఎకరాలతో ఉన్న గుట్టను ఐలాండ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించినా ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు. ప్రాజెక్ట్ వద్ద సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల ప్రజలకు ఎంతో ఇష్టమైన పోచమ్మ తల్లి దేవాలయం కూడా ఉంది. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఇక్కడికి వచ్చే పర్యాటకులు, వేములవాడకు వచ్చే యాత్రికులకు ప్రాజెక్ట్ ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుందని భావిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కార్మిక, కర్షక, ధార్మిక ఆధ్యాత్మిక జిల్లాగా రాజన్న సిరిసిల్ల నిలుస్తోంది. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నా పర్యాటకులకు నిరాశే కలుగుతోంది. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న జిల్లాలోని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. టెంపుల్ టూరిజానికి అవకాశం ఉన్నా గత ప్రభుత్వ హయాంలో అడుగులు పడలేదు. ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి. గత సంవత్సరం నవంబరులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి శంకుస్థాపనలతో అతిపెద్ద శైవక్షేత్రంగా పేరొందిన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని అద్భుతమైన రీతితో తీర్చిదిద్దేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. గత ప్రభుత్వ హయాంలో భారీ నిధులతో అభివృద్ధి చేస్తామన్న హామీలు కాగితాల మీద డిజైన్లుగా మాత్రమే ఆకర్షించాయి. కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సమయంలో పీసీసీ అధ్యక్ష హోదాలో రేవంత్‌రెడ్డి వేములవాడ రాజన్నను దర్శించుకొని అభివృద్ధి చేస్తామని మాట ఇచ్చారు. మాటకు కట్టుబడి అధికారంలోకి రావడంతోనే బడ్జెట్‌లో రూ.50 కోట్లు నిధులు పొందుపర్చారు. దానికి అనుగుణంగానే వేములవాడలో ఇతర అభివృద్ధి పనులు దేవస్థానం ఆలయ విస్తరణకు రూ.127.65 కోట్లు మంజూరు చేస్తూ జీవోలు జారీ చేశారు. దీంతో పాటు భక్తులకు, పర్యాటకుల కోసం అన్నదాన సత్రం కూడా నిర్మిస్తున్నారు.

● ఎదురు చూపుల్లోనే... జల విహారం

శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అనంతగిరి ప్రాజెక్ట్, ఎగువ మానేరు ప్రాజెక్టుల వద్ద పర్యాటక హంగులు కల్పించే దిశగా గత ప్రభుత్వం హడావిడి చేసినా పర్యాటకులకు జల విహారం ఎదురుచూపులే మిగిల్చింది. శాసనసభ ఎన్నికల సమయంలో శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ సిరిసిల్ల జిల్లా కేంద్రలోని కరకట్ట వద్ద అప్పటి మంత్రులు బోటును ప్రారంభించి జలవిహారానికి నాంది పలికినా ప్రారంభోత్సవం తోనే నిలిచిపోయింది. దాదాపు మూడు సంవత్సరాలుగా సిరిసిల్ల ప్రజలు జలవిహారానికి ఎదురుచూసినా నిరాశపర్చింది. ఇప్పటికీ ప్రారంభించిన బోట్లు కరకట్ట వద్ద వెక్కిరిస్తూ కనిపిస్తున్నాయి. జిల్లాలోని మిడ్‌మానేరు, అన్నపూర్ణ రెండు ప్రాజెక్టులు పర్యాటకానికి కీలకంగా మారుతాయని భావించారు. దక్షిణ కాశీగా వేమువాడల శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ప్రసిద్ధి చెంది ఆధ్యాత్మికతకు పర్యాటకం తోడవుతుందని అనుకున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాలకు సిరిసిల్ల మానేరు తీరంలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్టులు ప్రధానంగా నిలుస్తాయి. ఈ ప్రాజెక్టుల వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని 2021 జూలై 4న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అనంతగిరి పోచమ్మను దర్శించుకుంటానని అన్నపూర్ణ అనంతగిరి, శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులను పర్యాటక అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. వేములవాడ ఆధ్యాత్మికతకు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు పర్యాటకం కూడా స్వాగతం పలుకుతుందని భావించినా ఆచరణలోకి మాత్రం రాలేదు. మిడ్ మానేరు వద్ద కొడుముంజ గుట్టలకు కలుపుకొని రోప్‌వేలు, కాటేజ్‌ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. అదేక్రమంలో మిడ్ మానేరు బ్యాక్ వాటర్ సిరిసిల్ల కరకట్ట వద్ద బోటును కూడా సిద్ధం చేసినా కొవిడ్‌తో ప్రారంభానికి నోచుకోలేదు. శాసనసభ ఎన్నికల క్రమంలో గత సంవత్సరం ఆగస్టు 18న హడావిడిగా, నామమాత్రంగా ప్రారంభోత్సవం చేసి వదిలేశారు.



అన్నపూర్ణ ప్రాజెక్టులో మత్స్యకారులు (ఫైల్)



- స్టూడెంట్... టూరిజం
- తెలంగాణ దర్శిని పేరుతో పర్యాటక ప్రాంతాల సందర్శన
- నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

ప్రతి యేడాది జనవరి 25న దేశ వ్యాప్తంగా పర్యాటక దినోత్సవం జరుపుకుంటారు. భారతదేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సంప్రదాయ విలువల అభివృద్ధికి పర్యాటక రంగం తోడ్పడాలని టూరిస్ట్ ట్రాఫిక్ కమిటీ స్థాపించిన సందర్భంగా 1948 నుంచి జాతీయ పర్యాటక దినోత్సవాన్ని జరుపుతున్నారు. పర్యాటక రంగంలోని విభిన్న సంస్కృతులను ప్రోత్సహించడం, ఆయా పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేయడం, పర్యాటక ప్రాముఖ్యతను పెంచడమే లక్ష్యం.

సిరిసిల్ల/కరీంనగర్ కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) :దేశంలోని వివిధ ప్రాంతాలను, అక్కడి సంస్కృతులను తెలుసుకునేందుకు స్టూడెంట్ టూరిజంను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ విద్యా సంవత్సరం తెలంగాణ దర్శిని పేరిట పర్యాటక ప్రాంతాల సందర్శనకు అవకాశం ఇచ్చింది. ప్రభుత్వమే విహార యాత్రలకు అయ్యే ఖర్చులు భరిస్తుంది.

● పాఠశాలలో టూరిజం క్లబ్‌లు..

పాఠశాలల్లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం యువ టూరిజం క్లబ్‌లను కూడా ఏర్పాటు చేయనుంది. 7వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే విద్యార్థులకు టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి క్లబ్‌లో 25 మంది విద్యార్థులను సభ్యులుగా ఏర్పాటు చేస్తారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తూ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడే లక్ష్యంగా క్లబ్‌లు పనిచేసే విధంగా చూస్తారు. క్లబ్‌ల ద్వారా విద్యార్థి స్థాయి నుంచే సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించనున్నారు.

● పర్యాటక, విజ్ఞాన విహార కేంద్రాలు

మిడ్ మానేరు ప్రాజెక్ట్, ఎగువ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ ప్రాజెక్ట్, అర్బన్ పార్కులు, దిగువ మానేరు డ్యాం, ఉజ్వల, డీర్ పార్కులు, ఎన్‌టీపీసీ రామగుండం, రామగిరి, ఎలగందుల, మొలంగూర్, కోటి లింగాల, జగిత్యాల, నగునూరు, మానకొండూరు కోటలు, సర్వాయి పాపన్న గుట్టలు, ధూళికట్ట బౌద్ధక్షేత్రం, వేములవాడ, గుండారం, బోల్, బుగ్గ, అక్కపల్లి, తోటపల్లి, మానకొండూరు, కొత్తపల్లి చెరువులు, కరీంనగర్ మ్యూజియం చూడదగ్గ ప్రాంతాలు. పొరుగు జిల్లాలోని బాస ర, అలీసాగర్, బోటానికల్ గార్డెన్, కోమటి చెరువులాంటి ప్రాం తాలను చూసే అవకాశం విద్యార్థులకు లభిస్తుంది.

పెద్దపులి సంచారంపై పరిశీలన

● నాలుగు బృందాల ఏర్పాటు

కొడిమ్యాల, జనవరి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్‌లో ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపడంతో అధికారులు, సిబ్బంది నాలుగు బృందాలుగా అటవీ ప్రాంతంలో పరిశీలిస్తున్నారు. పెద్దపెల్లి అటవీ కార్యాలయం నుంచి తీసుకొచ్చిన నాలుగు కెమెరా ట్రాప్‌లను కొండాపూర్ శివారు ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ మాట్లాడారు. కారిడార్ ఆధారంగా ఎస్ 12 అనే పెద్దపులి సిర్పూర్ నుంచి ఖానాపూర్ మీదుగా ఈ నెల 22న రాత్రి కొండాపూర్ అటవీ ప్రాంతానికి చేరుకున్నట్లు భావిస్తున్నామన్నారు. పెద్దపులి ఒక రోజులో నాలుగు దిక్కుల్లో 25 కిలోమీటర్ల చొప్పున 100 కిలోమీటర్ల పరిధిలో తిరుగుతుందని, ఆవాసాన్ని ఏర్పాటు చేసుకొని ఉండడానికి ప్రయత్నిస్తుందని, లేదా ఆ ప్రదేశం నుంచి వెళ్లిపోతుందని తెలిపారు. పెద్దపులి సంచారంతో వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ నుంచి కొండాపూర్, కొడిమ్యాల నుంచి కోనాపూర్, కోనాపూర్ నుంచి దమ్మయ్యపేట, దమ్మయ్యపేట నుంచి నూరంపేట అటవీ ప్రాంతాల్లో



అడవిలో పరిశీలిస్తున్న సిబ్బంది

పొలాల వద్దకు వెళ్లే రైతులను, పశువుల కాపరులను అప్రమత్తం చేస్తున్నట్లు చెప్పారు. పంట రక్షణ కోసం ఎవరైన ఉచ్చులు, విద్యుత్ తీగలు, ఉరులు ఏర్పాటు చేస్తే తొలగించాలన్నారు. రాత్రి పూట బయటకు రావద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. డీఆర్వోలు ముషీర్ అహ్మద్ మోనిక, సెక్షన్ ఆఫీసర్లు రత్న, సుబ్బారావు ఉన్నారు.

● రక్షణ కోసం కర్రతో పొలాలకు వెళ్లండి



రేంజర్ మొయినుద్దీన్

కొడిమ్యాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అటవీ ప్రాంతం గుండా పొలాలకు వెళ్లే రైతులతోపాటు గ్రామస్థులు రక్షణ కోసం కర్రకు చిన్న గంట కట్టుకొని వెంట తీసుకెళ్లాలని కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ సూచించారు. గురువారం మండలం లోని కొండాపూర్‌లో పెద్దపులి దాడిలో ఆవు మృతి చెందింది. ఈ సంఘటనలో శుక్రవారం కొడి మ్యాలలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అటవీ ప్రాంతల గుండా గ్రామస్థులు రాకపోకలు సాగించవద్దన్నారు. అటవీ శాఖ వారు ఏర్పాటు చేసిన చెక్ గేట్లకు అభ్యంతరం చెప్పవద్దన్నారు. అన్నదాతలు ఒంటరిగా కాకుండా 8 నుంచి 10 మంది కలిసి వెళ్లిరావాలన్నారు. 10 మందిలో ఇద్దరు డప్పు చప్పుడు చేయాలని, మరో ఇద్దరు విజిల్ వేయాలని సూచించారు. పొలాల వద్ద మంచె ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామం నుంచి అర కిలో మీటరు కన్నా ఎక్కువ దూరం గొర్రెలు, పశువులను మేతకు తీసుకెళ్లొద్దన్నారు. ఉదయం పది తర్వాత వెళ్లాలని, సాయంత్రం నాలుగు గంటల వరకు ఇంటికి చేరుకోవాలని అన్నారు. గ్రామ రక్షణ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పశువుల కాపరులకు పులి సంచారం, పగ్ మార్కులు కనిపిస్తే గ్రామ రక్షణ కమిటీలకు, అటవీ శాఖ అధికా రులకు సమాచారం అందించాలన్నారు. గ్రామస్థులు వెళ్లే ప్రాంతాల సమాచారాన్ని గ్రామ రక్షణ కమిటీలకు తెలుపాలన్నారు. పెద్ద పులికి ఎవరూ హాని చేయవద్దని, వలలు, ఉచ్చులు విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయవద్దని పేర్కొన్నారు. పులికి హాని కలిగించె వ్యక్తులపై వన్యప్రాణి రక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రేంజర్ వెంట డిప్యూటీ రేంజర్ ముషీర్ అహ్మద్ ఉన్నారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న రాజన్న ఆలయం

● ఆలయ గోపురాలకు రంగులు

వేములవాడ కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి జాతరకు ముస్తాబవుతోంది. మూడు రోజులపాటు నిర్వహించే మహాశివ రాత్రి జాతరను పురస్కరించుకొని ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులు చకచకా నిర్వహిస్తు న్నారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, ఆలయ గోపురాలకు రంగులు వేస్తున్నారు. మహాశివ రాత్రికి రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చర్యలు తీసుకోనున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు.



రాజన్న ఆలయ గోపురాలకు రంగులు వేస్తున్న కార్మికులు

● రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకొని, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తాం

- కేంద్ర పట్టణాభివృద్ధి, విద్యుత్, గృహనిర్మాణశాఖ మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్
- కరీంనగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కేంద్ర మంత్రి ఖట్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని కేంద్ర పట్టణాభివృద్ధి, విద్యుత్, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్ అన్నారు. కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. మల్టీపర్పస్ పార్కు, అంబేద్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్సు, ప్రతిరోజూ నిరంతరం నల్లానీటి సరఫరా, ఈక్లాస్ రూమ్స్‌ను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాటాడారు. కేంద్రమంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్ ప్రియమైన కరీంనగర్ ప్రజలారా నమస్తే... అంటూ తెలుగులో మాట్లాడటం ప్రారంభించి రెండు నిమిషాలపాటు తెలుగులోనే ప్రసంగించి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని మా ప్రభుత్వం గత పదేళ్లలో 10 లక్షల కోట్లకు పైగా నిధులను తెలంగాణ అభివృద్ధి కోసం, ఇక్కడి ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేసిందన్నారు. కేంద్రం కేటాయించిన నిధులను సకా లంలో ఖర్చు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫల మైందన్నారు. ప్రభుత్వాలు, పార్టీలు వేరైనా కేంద్రం, రాష్ట్రం కలిసికట్టుగా ముందుకెళ్లాల్సిన అవసరముందని అన్నారు. తెలంగాణ విషయంలో కేంద్రం వివక్ష చూపుతుందంటూ చేస్తున్న ప్రచారాన్ని ఖండించారు. తెలంగాణలో రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధికి గత పదేళ్లలో రూ. 32,946కోట్లను కేటాయించి రాష్ట్రంలో రైల్వే స్టేషన్ల రూపురేఖలే మారుస్తున్నామని చెప్పారు. రామగుండంలో యూరియా పరిశ్రమ ఏర్పాటు చేసి ఎరువుల కొరత లేకుండా చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని కేంద్రమంత్రి ఖట్టర్ అన్నారు. రోజ్‌గార్ మేళా పేరుతో ఎలాంటి అవినీతికి, జాప్యానికి తావు లేకుండా నిర్ణీత వ్యవధిలో పరీక్షలు నిర్వహించి 9.25 లక్షల మందికి నియామక పత్రాలు అందించామన్నారు.

● కరోనాను అరికట్టడంలో కరీంనగర్ ఆదర్శం

కరోనా సమయంలో ఒకేసారి 13 పాజిటివ్ కేసులు ఈ కరీంనగర్‌లోనే మొదటిసారి వచ్చాయని



అంబేద్కర్ స్టేడియంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్

కేంద్ర మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్ అన్నారు. ఆ సమయంలో మొదటిసారి గెలిసిన ఎంపీ బండి సంజయ్.. వైద్య సిబ్బందికి అండగా నిలిచి అతనే నేరుగా.. జిల్లా ఆసుపత్రిని సందర్శించిన వార్తలు తాను చూశానన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో క్వారంటైన్ విధానాన్ని మొదటిసారి అవలంభించి కరోనా వ్యాప్తి చెందకుండా అరికట్టారన్నారు. వ్యాక్సినేషన్ విషయంలోనూ ఇక్కడే మొదటిసారి అందరికీ పూర్తి చేసి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. వాటర్ ప్లస్ కార్యక్రమంలో భాగంగా.. కరీంనగర్ కార్పొరేషన్‌లో వాడిన నీటిని మళ్లీ యుటిలైజేషన్ చేసే విషయంలో 2023లో కరీంనగర్ మంచిస్థానంలో నిలిచిందని అన్నారు. నిధులను సక్రమంగా వినియోగించుకోవడంలో కరీంనగర్ ముందంజలో ఉందని అన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీలో భాగంగా కమాండ్ కంట్రోల్ ఆధునీకరించారని, దీనితో ప్రజల భద్రతకు మరింత మేలు జరుగుతుందని అన్నారు. స్మార్ట్‌క్లాస్ ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన బోధన అందుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల కోసం పట్టణాల్లో అమలు చేస్తున్న పీఎం స్వనిధి పథకం అమలు విషయంలో కరీంనగర్ దేశంలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఇక్కడ దాదాపు 1200 మంది వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రుణసహాయం అందుతుందని అన్నారు. కరీంనగర్‌లో డంపింగ్ యార్డు సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని కేంద్రం అందిస్తుందని మంత్రి ఖట్టర్ హామీ ఇచ్చారు.

కరీంనగర్ జిల్లా అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి

● మంత్రి పొన్నం ప్రభాకర్



రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా జిల్లా అభివృద్ధిలో నెంబర్‌వన్‌గా ఉండేందుకు అందరూ సహకరించాలని అన్నారు. డంపుయార్డు సమస్య పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కేంద్ర ప్రభుత్వం కూడా సహక రించాలని కోరారు. కరీంనగర్ స్మార్ట్‌సిటీకి మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తోపాటు ఎంపీగా తాను, ప్రస్తుతం ఎంపీ, మంత్రి సంజయ్ కృషిచేశామని చెప్పారు.

సొంతింటి కల సాకారం చేసుకునేలా చూడాలి

● మంత్రి పొంగులేటి



రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాల్లో స్వంతింటి కలను సాకారం చేసుకునేందుకు ఇళ్లను మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద తెలంగాణకు 8శాతం ఇండ్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం 0.7శాతం మాత్రమే ఇండ్లు వచ్చాయని అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటా మేరకు సంక్షేమ పథకాలు, నిధులు తెచ్చేందుకు తెలంగాణకు చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ కృషిచేయాలని శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

సామాన్యుడి చేతిలో వజ్రాయుధం ఓటు

5వ పేజీ తరువాయి

పురుషులు	:3,53,732
మహిళలు	: 3.63.617
ఇతరులు	:51
సర్వీస్ ఓటర్లు	: 653
పోలింగ్ కేంద్రాలు	: 845
మొత్తం ఓటర్లు	: 7,18,043

జాబితాను సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం వెలువరించింది. జిల్లాలో 7,18,043 మంది ఓటర్లు ఉన్నారు. 2024 అక్టోబర్ 29న ప్రక టించిన జాబితాలో 7,19,491 మంది ఉండగా, తాజాగా 6147 మంది కొత్తగా ఓటు హక్కును నమోదు చేసుకోగా, 8248మంది తొలగించ డం, అడ్రస్ మార్పు చేసుకున్నారు. దీంతో గతంలో కంటే ఓటర్లు తగ్గా రు. జిల్లాలో పురుషుల కంటే మహి ళ ఓటర్లే అధికంగా ఉన్నారు.

కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లకు గుర్తింపు కార్డును కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ చేతుల మీదుగా ఇవ్వనున్నారు. ఆయా గ్రామా లు, మండలాల్లో నూతనంగా 18 సంవత్సరాలు నిండి కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారిని గుర్తించి సమావేశానికి పిలువనున్నారు. దీనిపై ప్రత్యేక అవగాహనను ఏర్పరచనున్నారు.

సిరా చుక్కతో రాజకీయాలు తారుమారు

ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ నేతలు పరుగులు తీస్తారు. సామాన్యుడి నిర్ణయాలతో రాజకీయాలు, దేశ భవిష్యత్‌లోను మార్పులు వస్తాయి. ఓటుకు రాజకీయ నేతల భవిష్యత్ చూపుడు వేలుకు పెట్టే సిరా చుక్కతో తారుమారవుతుంది. రాజ్యాంగం ప్రతీ ఒక్కరికి కల్పించిన హక్కు ఓటుహక్కు. ఓటుహక్కు పొందడానికి ఎన్నికల కమిషన్ విస్తృ తంగా ప్రచారం నిర్వహిస్తుంది. 18ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరు అర్హులు.

మున్సిపల్ పాలకవర్గాల గడువు పూర్తి

5వ పేజీ తరువాయి

కానీ పాలకవర్గాల పదవీకాలాలు ముగుస్తున్న సమయంలో అభివృద్ధి పనులు జరుగుతుండడంతో కౌన్సిలర్లు నిరాశకు లోనవుతున్నారు. పెద్దపల్లి, మంథనిలకు అమృత్ ద్వారా మంచినీటి పథకాలు మంజూరు కాగా రామగుండానికి ఎస్‌టీపీలు మంజూరయ్యాయి.

అపవాదులను మూటగట్టుకున్న రామగుండం కార్పొరేషన్

రామగుండం మున్సిపాలిటీగా ఏర్పడిన తరువాత ప్రస్తుత పాలకవర్గంలోని ప్రజాప్రతినిధులపై వచ్చినన్ని ఆరోపణలు మరే పాలకవర్గంపై రాలేదు. ముఖ్యంగా రామగుండంలో 14వ ఆర్థిక సంఘం నిధులతో ఆగ్రోస్ ద్వారా కొనుగోలు చేసిన వాహనాల కొనుగోలులో కుంభకోణం పాలకవర్గానికే మచ్చ తెచ్చింది. వాహనాలు రాకున్నా కూడా ఏడాది ముందే రూ.8కోట్లు చెల్లించడం దుమారాన్ని లేపింది. అలాగే కార్పొరేషన్‌లోని పారిశుధ్య విభాగంలో పనులు పెట్టిస్తామని పలువురు కార్పొరేటర్లు లక్షల రూపాయలు వసూలు చేసి ఇప్పటికీ తిప్పుకుంటున్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉద్యోగాల దందా, దళితబంధు, గృహలక్ష్మిల్లో వసూళ్లకు పాల్పడి డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులు రాణాలను ఆశ్రయించడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. మున్సిపల్ స్క్రాప్ చోరీకి గురికావడం చర్చనీయాంశమైంది. మున్సిపాలిటీకి సంబంధించి కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఆర్‌డీవో శివకుమార్ ఏసీబీకి పట్టుబడ్డాడు. జరుగని పనులకు బిల్లులు రికార్డు చేసిన విషయాలు వెలుగు చూశాయి. రూ.3కోట్ల బిల్లులు పాలకవర్గం తిరస్కరణకు గురయ్యాయి.

27 నుంచి ప్రత్యేకాధికారుల పాలన...

నగరపాలక సంస్థతోపాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలకు ఈనెల 27 నుంచి ప్రత్యేకాధికారుల పాలన జరుగనున్నది. రామగుండానికి ప్రస్తుతం అదనపు కలెక్టర్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. కలెక్టర్‌ను ప్రత్యేకాధికారిగా నియమించే అవకాశం ఉంది. పెద్దపల్లికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కు, మంథని, సుల్తానాబాద్‌ల్లో ఆర్‌డీవోలకు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.

పెద్దపల్లి మున్సిపల్...

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి) : రేపటితో పెద్దపల్లి మున్సిపల్ పాలకవర్గం గడువు ముగియనుంది. 36 మంది కౌన్సిలర్లతో 21 వార్డు కౌన్సిలర్ మమతా రెడ్డిని చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచులు, మండల పరిషత్, జల్లా పరిషత్ కాలం ముగిసి ఏడాది దాటిన ఇంకా ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలున్నాయి. ఇప్పుడు మున్సిపాల్టీల పరిస్థితి అదే కనబడుతోంది. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే నివేదిక ఆధారంగా రిజర్వేషన్లతో ప్రభుత్వం ఎన్నికలకు ముందుకు వెళ్లే అవకాశం ఉంది. గ్రామ పంచాయతీ, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు ఎన్నికల తరువాతే మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నట్లు తెలుస్తోంది.

ఆకట్టుకుంటున్న జలపాతాలు.. ఆలయాలు...

పెద్దపల్లి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జలపాతాలు, ఆలయాలు పర్యాటకులను ఆకట్టుకొంటున్నాయి. వానాకాలంలో ఇక్కడ ప్రకృతి పులకరించిపోతోంది. జిల్లా కేంద్రం నుంచి 12 కిలోమీటర్ల దూరంలో సబ్బితం పంచాయతీ పరిధిలోని గౌరిగుండాల జలపాతాన్ని చూసేందుకు పలు జిల్లాల నుంచి పర్యాటకులు వస్తారు. సహజంగా వెలిసిన గౌరిగుండాలకు గుట్టపై నుంచి వర్షపు నీరు జాలువారి జలపాతంగా వచ్చి గుండాలలో నిల్వ ఉంటుంది. పర్యాటకులు జలపాతంలో స్నానాలు చేస్తారు. పలు రకాల చెట్ల నుంచి నీరు వస్తుండడంతో ఆరోగ్యానికి ఉపకరిస్తుందని నీటిని సేకరించి తాగుతారు.


అలాగే జిల్లాకు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముత్తారం పంచాయతీ పరిధిలోని పురాతనమైన అండాలమ్మ ఆలయం ప్రాంగణం పర్యాటకరంగా మారుతోంది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆలయాన్ని పల్లె ప్రకృతివనంగా ఏర్పాటు చేయడంతో పచ్చదనం, పూల చెట్లతో శోభిల్లుతోంది. కొంతకాలంగా పర్యాటకులే కాకుండా, ఫొటోషూట్‌లకు నిలయంగా ఉంది. విద్యార్థులు, కుటుంబాల వారీగా ఉద్యోగులు, ఇక్కడికి వచ్చి ఆహ్లాదంగా గడుపుతున్నారు.

పాండవుల లంక...

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రానికి 18కిలోమీటర్ల దూరంలో ఉన్న జాఫర్‌ఖాన్‌పేట గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ప్రకృతి రమణీయమైన పాండవలంక ఉంది. వర్షాకాలంలో రామగిరి కొండల నుంచి వచ్చే వర్షపు నీరు పాండవలంకలో జాలువారుతూ ఆకట్టుకుంటుంది. పాండవులు అరణ్యవాసం చేసేటప్పుడు ఈప్రాంతంలో ఉండడం వలన పాండవలంక అని పేరు వచ్చిందని పూర్వీకులు చెబుతారు. పాండవలంకలో జలపాతంతోపాటు పాండవుల బొమ్మలు, ఆంజనేయస్వామి విగ్రహం ఉంది. వర్షాకాలంలో జలపాతం చూసేందుకు పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తారు. జాఫర్‌ఖాన్‌పేట, కునారం, వెన్నంపల్లి గ్రామాలకు దగ్గరగా ఉన్న పాండవలంక వెళ్లేందుకు దారి లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాఫర్‌ఖాన్‌పేట నుంచి కొంతవరకు మట్టిరోడ్డు ఉంది. అనంతరం పాండవలంక వరకు రోడ్డు లేకపోవడంతో పర్యాటకులు నడక మార్గాన వెళ్లక తప్పడంలేదు. కునారం, జాఫర్‌ఖాన్‌పేట గ్రామస్థులు శ్రావణమాసంలో ఈప్రాంతంలో వనభోజనాలకు వెళ్తారు. రామగిరి గుట్టల నుంచి వచ్చే నీరు ఎన్నో వనమూలికలతో ఉంటాయని నీటిని తాగేందుకు తీసుకువెళతారు. పాండవలంక ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటుచేయాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ప్రజలు విన్నవిస్తున్నారు.

రామగిరి ఖిల్లా

రామగిరి,(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ శివారులోని రామగిరిఖిల్లా ప్రకృతి అందాలకు నిలయంగా ఉంది. ప్రకృతి ప్రేమికులను అబ్బురపరిచే కాకతీయ కట్టడాలు, బురుజులు, ఖిల్లాపై ఏడు ద్వారాలు ప్రాచీన సంపదకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ప్రకృతి సంపదతోపాటు ఖిల్లాపై వేల రకాల ఔషధ మొక్కలు ఉన్నాయి. వివిధ రకాల వ్యాధులకు ఔషధ గుణాలు కల్గిన వనమూలికలు ఉన్నాయి. శ్రావణ మాసంలో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఖిల్లాపై కొలువైన సీతారామాంజనేయులను దర్శించుకుంటారు. ఖిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 కోట్ల నిధులను విడుదల చేసింది.





ముత్తారంలోని అండాలమ్మ ఆలయం, కమాన్‌పూర్‌లోని ఆదివరాహస్వామి ఆలయం

ఆదివరాహస్వామి ఆలయం

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. ఋషి తపస్సుకు మెచ్చి శ్రీహరి ఇక్కడ ఆదివరాహస్వామి రూపంలో వెలిసాడని చెబుతారు. మొదట మూషికం మాదిరిగా చిన్నగా వెలసిన స్వామివారి విగ్రహం యేటా పెరుగుతుండడం ఇక్కడి ప్రత్యేకత. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రెండు మాత్రమే ఆదివరాహస్వామి ఆలయాలు ఉన్నాయి. తిరుమల ప్రాంతంతోపాటు కమాన్‌పూర్ మండలంలో ఉన్న ప్రాచుర్యం పొందింది. పెద్దపల్లి జిల్లా కేంద్రానికి కేవలం 15కిలోమీటర్ల దూరంలో మంథని వెళ్లే దారిలో ఆలయం ఉంది. కమాన్‌పూర్ మండల కేంద్రంలోని అరుదైన ఆదివరాహస్వామి ఆలయం వరాలస్వామిగా ప్రాచుర్యం పొందింది.

నంది మేడారం...

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): నంది మేడారంలో కాకతీయుల కాలం నాటి కోటలు, ఆలయాలతోపాటు ఏకశిల నంది విగ్రహం ఉంది. కాకతీయుల సామంతులైన మేడరాజులు ఈ ప్రాంతాన్ని పాలించడం, పెద్ద ఏక శిల నంది విగ్రహం ఉండడంతో నంది మేడారంగా ఈ ప్రాంతం ప్రాచుర్యం పొందింది. ఇక్కడ ఉన్న నంది విగ్రహం 7.5 అడుగుల పొడవు, 5.8 అడుగుల ఎత్తు ఉంది. సాగు, తాగు నీటి అవసరాలు తీర్చేందుకు కాకతీయులు చెరువును నిర్మించారు. చెరువు దగ్గరే తెలంగాణ ప్రభుత్వం నంది రిజర్వాయర్‌ను ఏర్పాటు చేసింది. చెరువు కట్టపై త్రికూటాలయం కాకతీయుల కళావైభవానికి తార్కాణంగా నిలుస్తుంది. శిలాస్తంభం అమరేశ్వరాలయం నాగిని ప్రతిమ, గణపతి, సప్తమాతృకలున్నాయి. ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కాల్వశ్రీరాంపూర్‌లోని పాండవులలంక, రామగిరి ఖిల్లాపై బురుజు, నంది మేడారంలోని నంది విగ్రహం

బిరుదు రాజమల్లు చిరస్మరణీయులు

- కాంస్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ప్రతినిధిగా మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు ప్రజల్లో చిరస్మరణీయులుగా నిలుస్తారని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు వర్ధంతి పురస్కరించుకుని మున్సిపల్ ఆఫీసు చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని శుక్రవారం చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్సీ భానుప్రసాదరావుతో కలసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు రాజమల్లు స్మృతి వనం వద్ద బిరుదు కుటుంబ సభ్యులు, అభిమానులతో కలిసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. వర్ధంతి సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బిరుదు రాజమల్లు రాజకీయంగా ఎన్నో ఒడిదొడుగులకు గురైనా మొక్కవోని ధైర్యంతో నిలబడి కడదాకా ప్రజల్లో ఉన్నాడన్నారు. తండ్రి విగ్రహాన్ని ఆవిష్కరించి తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యే విజయరమణారావును బిరుదు కుమారులు, కుటుంబ సభ్యులు సత్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్, పెద్దపల్లి మార్కెట్ చైర్మన్లు మినుపాల ప్రకాష్‌రావు, ఈర్ల స్వరూప, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ఎల్ రాజయ్య, కొండ దేవయ్య, రాజగోపాల్, శ్రీధర్, రామస్వామి, సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్, హైదరాబాద్ ఏసీపీ గిరి, రిటైర్డు అదనపు ఎస్పీ ఉప్పు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఓదెల (ఆంధ్రజ్యోతి): కొలనూర్ రైల్వే గేట్ వద్ద మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. పెద్దపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్యయాదవ్ మాట్లాడుతూ బిరుదు రాజమల్లు పెద్దపల్లి ప్రాంత ప్రజలకు ఎంతో సేవ చేశారని, పీఏసీఎస్ చైర్మన్‌గా రాజకీయాల్లోకి అడుగు పెట్టి 1994లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా గెలిచారని గుర్తు చేసుకున్నారు. మాజీ సర్పంచ్ కుంచంమల్లయ్య, కందుల సదాశివ్, పల్లపు కొమురయ్య ,బండారి చంద్రయ్య ,కందుల అశోక్ పటేల్ ,మాడిశెట్టి శంకరయ్య, కొంగర శంకరయ్య ,వేల్పులకుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

పెద్దపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. శుక్రవారం పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాల అడ్మిషన్లు పెంపు ప్రక్రి యలో తన వంతు సహకారం అందిస్తానని, ఇంటర్మీ డియట్ పూర్తయిన విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తగిన ప్రణాళికలు రూపొందిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య తెలిపారు. అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ఓదెల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కొలనూర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం కరీంనగర్ ప్రతిమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదేశం మేరకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవీందర్ గౌడ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని కొలనూర్ తో పాటు గోపరపల్లి, హరిపురం, ఉప్పరపల్లి ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

బొంపల్లిలో ఉచిత వైద్య శిబిరం

పెద్దపల్లి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బొంపల్లిలో రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పి రవళి మాట్లాడుతూ నిక్షయ్ శిబిర్ వంద రోజుల పథకంలో భాగంగా గ్రామంలో క్షయ శిబిరాన్ని నిర్వహించినట్లు, అలాగే గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఏఎన్‌ఎంలు ప్రమీల, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు లలిత, రేణుక , జ్యోతి, అనూష పాల్గొన్నారు.

బాలికలు లక్ష్యాల సాధనకు కృషి చేయాలి



జాతీయ బాలికల దినోత్సవ ంలో పాల్గొన్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికలు ఉన్నత స్థాయికి చేరుకునే విధంగా గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో బాలికలకు విద్య అవకాశాలు తక్కువగా ఉండేవని, ఆ పరిస్థితి నేడు లేదన్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకుంటూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని, విద్య, వైద్యం, క్రీడలు, సాంస్కృతిక, మొదలైన వివిధ అన్ని రంగాలలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. బాలికలను సంరక్షించాలని, వారిని చదివించాలని బాల్య వివాహాల నివారణకు పటిష్ఠచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో బేటి బచావో బేటి పడావోకు మద్దతుగా ఏర్పాటు చేసిన బోర్డుపై కలెక్టర్ సంతకం చేశారు. ఆడపిల్లను రక్షిద్దాం ఆడపిల్లను చదివిద్దాం సంబంధించి పోస్టర్ ఆవిష్కరించారు. విద్యార్థినులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, జీసీడీవో కవిత, పెద్దపల్లి సీడీపీవో కవిత, సంపదకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ప్రేమలత, పుష్పాలత, డీసీపీవో కమలాకర్, పోషన్ అభియాన్ కోఆర్డినేటర్ కె.అనిల్, సఖి కోఆర్డినేటర్ డి. స్వప్న పాల్గొన్నారు.

కస్తూర్బాలో జాతీయ బాలికల దినోత్సవం

రామగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూరు గ్రామపంచాయతీ పరిధిలోని కస్తూర్బా పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో తొమ్మిదవ తరగతికి చెందిన కొలిపాక అక్షయకు లయన్స్‌క్లబ్ సభ్యుడు మేకల మారుతీయాదవ్ బహుమతిని అందజేశారు. యస్‌వో మంజుల, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

పాలకుర్తి,జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించాలని బసంత్‌నగర్ టోల్‌ప్లాజా ఏజీఎం రామకృష్ణ అన్నారు. శుక్రవారం టోల్ ప్లాజా అధికారులు, సిబ్బంది రహదారి భద్రత వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బసంత్‌నగర్ జిల్లా పరిషత్, ఇంగ్లీష్ మీడియం, కేశోరాం సిమెంటు కార్మికులకు, లారీ, ఆటో, కేఎఫ్‌టీ డ్రైవర్లకు, పలు ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రత నియమ నిబంధనలను వివరించారు. ప్రాజెక్టు మేనేజర్ జి రామకృష్ణ, ప్లాజా మేనేజర్ కన్న బాబు, ఏపీఎంలు నవీన్ కుమార్, రమేష్, పీఆర్‌వో హెచ్ రాము, హెచ్ ఆర్ సుజీత్, టోల్ ప్లాజా సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం

సుల్తానాబాద్ , జనవరి 24: (ఆంధ్రజ్యోతి): కొదురుపాక గ్రామంలో కల్లేపల్లి కనకయ్య అనే వ్యక్తి గుడిసె ప్రమాదవశాత్తు కాలిపోయింది. శుక్రవారం మధ్యాహ్నం గుడిసె నుంచి మంటలు రావడంతో ప్రజలు పెద్దపల్లి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. అప్పటికే గుడిసెలోని వస్తువులు కాలి బూడిదయ్యాయి.

బడిమానేసిన బాలికలను కస్తూర్బాలో చేర్పించిన ఎంఈవో

కాల్వశ్రీరాంపూర్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దరాతుపల్లి గ్రామానికి చెందిన బాలికలు ధనలక్ష్మి, కోమల బడి మానేసినట్లు ఎంఈఓ మహేష్ తెలిపారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి చదువు ఆవశ్యకత గురించి వివరిం చారు. శుక్రవారం పిల్లలను మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో చేర్పించినట్లు ఎంఈ ఓ పేర్కొన్నారు. పిల్లలను పాఠశాలలకు పంపించేలా తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈఓ కోరారు.

లక్షడప్పులు కార్యక్రమానికి తరలిరండి

ఎలిగేడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న జరిగే వేల గొంతుకలు లక్ష డప్పుల కార్యక్రమానికి తరలి రావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బాసంపల్లి శ్రీనివాస్, జల్లి రమేష్‌లు అన్నారు. ముప్పిరితోటలో శుక్రవారం మాదిగ కళాకారుల ప్రదర్శన నిర్వహించారు. మండల మాదిగ దండోరా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్లి లింగయ్య, ఉపాధ్యక్షుడిగా లచ్చయ్య, రామయ్య, ప్రధాన కార్యదర్శిగా కనుకుట్ల లచ్చయ్య, కోశాధికారిగా ఆనంద్, గౌరవ అధ్యక్షుడిగా గణేష్, కనుకుట్ల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పాఠశాలకు బోర్‌వెల్ ఏర్పాటు

కాల్వశ్రీరాంపూర్,జనవరి24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు తాగునీటి ఇబ్బంది రాకుండా మీర్జంపేట పాఠశాలలో బోర్‌వెల్‌కు మరమ్మతు చేయించినట్లు మాజీ ఎంపీటీసీ పోశాల సదానందం తెలిపారు.


వాకర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

పెద్దపల్లి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ఐటీఐ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం రాఘవపూర్‌లోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగింది. వాకర్స్ అధ్యక్షుడు కొట్టే లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటరెడ్డి పాల్గొన్నారు. మినీ ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్, జూనియర్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ స్నేహపూర్వక వైఖరితో ముందుకు సాగుతున్నాయన్నారు. ఐటీఐ వాకర్స్ అసోసియేషన్ నలభై మందితో ప్రారంభమై 180 మంది సభ్యులతో కొనసాగుతుందన్నారు. రోజు వ్యాయామ ప్రక్రియలతోపాటు సేవా సంబంధాలను నిర్వర్తిస్తుందని పేర్కొన్నారు. పలువురు విద్యుత్ ఉద్యోగులు లైటింగ్ కోసం ఐదు స్తంభాలను విరాళంగా అందిస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి రాజమల్లు, డిప్యూటీ గవర్నర్ అన్నాడి వెంకటరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అలుగుబెల్లి కృష్ణారెడ్డి, కోశాధికారి ధీటి సతీష్ తోపాటు సలహాదారులు కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడాకారుడిని అభినందించిన ఎమ్మెల్యే



జాతీయ స్థాయికి ఎంపికైన సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

సుల్తానాబాద్ , జనవరి 24: (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఏడవ తరగతి విద్యార్థి సంప్రీత్ ఎంపికయ్యాడు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ టేబుల్ టెన్నిస్ పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఫిబ్రవరిలో మధ్యప్రదేశ్ ఇండోర్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. ఎంపికైన విద్యార్థి సంప్రీత్‌ను శుక్రవారం ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాద రావులు అభినందించారు. స్కూల్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ మాటేటి కృష్ణప్రియ, సంజీవ్ కుమార్, రవిందర్, అజయ్, పల్లా సురేష్, దూడం ప్రకాష్ పాల్గొన్నారు

ఘనంగా డ్రైవర్స్ డే

మంథని, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డిపోలో డ్రైవర్స్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డీఎం శ్రవణ్‌కుమార్ డిపోలో డ్యూటీలకు వెళ్ళే డ్రైవర్లకు కరచాలనం చేసి పువ్వులు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. రోడ్ సెఫ్టీ మాసోత్సవాల సందర్భంగా అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఏఎంవీఐ మధు, ఏడీఎం ఏంజెల్, ఎల్‌హెచ్ శ్రీనివాస్, హెచ్‌సీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డిపో వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన

మంథని, (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బస్సుల పథకంలో సవరణలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ డిపో గేట్ ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న సబ్సిడీ ఇన్సెంటీవ్‌లు ఆర్టీసీ సంస్థకు ఇవ్వాలని, ఆర్టీసీ నేరుగా విద్యుత్ బస్సులు నడిపేలా సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. గణేష్, రాజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణిలో కారుణ్య నియామక పత్రాల అందజేత

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాల్లో భాగంగా ఆర్జీ-2 పరిధిలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన ఏడుగురు కార్మికుల వారసులకు శుక్రవారం జీఎం బండి వెంకటయ్య నియామక పత్రాలను అందజేశారు. జీఎం మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. సంస్థ అభివృద్ధిలో తల్లిదండ్రుల శ్రమను గుర్తుంచుకోవాలని జీఎం పేర్కొన్నారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ రవీందర్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, ఎస్‌ఎస్‌ఓ షరీఫ్ మహమ్మద్, డీవైపీఎం వంశీధర్ ఉన్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

పాలకుర్తి,జనవరి 24(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె గ్రామంలో శుక్రవారం చిన్నారి నల్లూరి మహిరశ్రీ(2) మెదడు వాపుతో కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. నల్లూరి సధయ్య దంపతుల ఏకైక సంతానం మహిరశ్రీ మృతిచెందడంతో అ కుటుంబం శోకసంద్రంలో మునిగింది.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

ధర్మారం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలకు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆర్థిక సాయం అందించింది. లంబాడి తండా (బి) గ్రామానికి చెందిన బానోత్ సంతోష్ నాయక్, నున్సావత్ రాజశేఖర్‌లు రోడ్డు ప్రమాదంలో మరణించారు. వారి కుటుంబాలకు అసోసియేషన్ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, ఉపాధ్యక్షులు రాజునాయక్, రతన్ నాయక్, కోశాధికారి శ్రీనివాస్ రూ.30 వేల సుకన్య సమృద్ధి యోజన పథకం బాండ్లను అందజేశారు.

తెలంగాణ ఉద్యమకారుడి విగ్రహ ఏర్పాటుకు శ్రీకారం

సుల్తానాబాద్, జనవరి 24: (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులు పారుపల్లి వైకుంఠపతి విగ్రహ ఏర్పాటు పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. స్థానిక నెహ్రూ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైకుంఠపతి అభిమానులు, తెలంగాణ ఉద్యమకారులు వైకుంఠపతి చిత్రపటానికి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు మాట్లాడుతు 1550 రోజుల పాటు దీక్షా శిబిరాన్ని నిర్వహించి రాష్ట్ర సాధనకు కృషి చేసిన వైకుంఠపతి విగ్రహాన్ని సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే విజయరమణారావు సహకారంతో ఏప్రిల్‌లో విగ్రహావిష్కరణ చేస్తామన్నారు. పారుపల్లి వెంకట ఉమాపతి, గుణపతి, బాబురావు, దయాకర్, ముత్యాలు, రౌతు సూరి, చంద్రయ్య, పాల్గొన్నారు.